# నాన్నలంతా ఇంతేనా?

-శ్రీమతి శాంతా కుమారి

"పెద్దబాబూ" అంటూ ఆర్ద్రంగా పార్వతమ్మ పిలిచింది.

"ఏంటమ్మా? ఏమిటో చెప్పు?" అడిగాడు పెద్దవాడు శీను.

"మీ నాన్నగారికి ఈ మధ్య వంట్లో బాగుండటం లేదు. డాక్టరుగారు పెద్ద హాస్పిటల్లో చూపించమంటున్నారు. మేమిద్దరం కూడా ఈ సారి నీతో బొంబాయి వద్దామనుకుంటున్నాంరా?" అంది పార్వతమ్మ.

"నేను ఎప్పుడూ క్యాంపులకు తిరుగుతుంటాను. మీ కోడలేమో హెల్త్ క్లబ్బుకు, మహిళా మండలి సెక్రటరీగా బిజీగా వుంటుంది. పిల్లలేమో వాళ్ళ చదువులతో వాళ్ళకు టైము సరిపోదు? మరి మిమ్మల్నెవరు చూస్తారు? ఈ వయసులో అక్కడికీ ఇక్కడికీ తిరగడమెందుకూ? మన వూరి ఆచారిగారి వైద్యం చాలదూ" అన్నాడు శ్రీను.

"అత్తయ్యగారూ! మీరు మా దగ్గర వుండటం మాకు చాలా సంతోషమే. కాని మేము బొంబాయిలో నాల్గవ అంతస్తులో వుంటున్నాం. అసలే మీకు ఆచారాలెక్కువ. అక్కడ అలాంటి ఆచారాలు సాగవు? మీరు ఇబ్బంది పడతారు" అంటూ పెద్ద కోడలు 'చూశారా? నేనంత నేర్పుగా మాట్లాడానో' అన్నట్టు భర్తవైపు చూసింది.



పార్వతమ్మగారు మౌనంగా లోపలికెళ్ళారు.

ఎక్కడో దూరంగా ఉద్యోగం చేస్తున్న పిల్లలందరూ సాధారణంగా ప్రతి సంక్రాంతి పండుగకు ఆ పల్లెటూరుకు రావడం ఆనవాయితీ.

పార్వతమ్మ, శంకర్‌రావుగారికి నలుగురు కొడుకులే. పిల్లలు కోరిన రీతిగానే చదువు చెప్పించడంతో అయిదెకరాల మాగాణీ కాస్తా ఒక ఎకరానికొచ్చింది.

రిటైరవగానే సొంత యింటిలో వుంటూ, పెన్షను పై ఖర్చులకు ఉపయోగించుకుంటూ, తిండికి గింజలు వస్తాయి కాబట్టి ఇద్దరూ ప్రశాంతంగా గడుపు తున్నారు. పిల్లలు ఎవరికి సెలవులు దొరికినప్పుడు వారు వచ్చి పోతూ ఉన్నారు. కాని ఎవ్వరూ పైసా ఇచ్చింది లేదు. ఏమైనా డబ్బు అవసరమా అని ఎప్పుడూ అడిగింది లేదు.

మనుమలూ, మనుమరాళ్లు మాత్రం ఆ లంకంత లోగిలిలో పెయ్యాదూడలతో పోటీగా పరుగెత్తుతూ, చెరుకుగడల నములుతూ, కాలువ గట్టున షికారు చేస్తూ, స్వేచ్ఛగా స్వచ్ఛమైన గాలి పీలుస్తూ తిరగడం నాయనమ్మ చేసి పెట్టిన జంతికలూ, సున్ని ఉండలూ అరగిస్తూ, తాతయ్య చెప్పే కథలు వింటూంటే, వారికి సంక్రాంతి సెలవులు అప్పుడే అయిపోయాయేమిటని బాధేస్తుంది.

అగ్గిపెట్టెలాంటి గదుల్లో, టన్ను పుస్తకాల బరువుతో నడ్డి విరిగిపోయినా, డైలీ రొటీన్ లైఫ్ నుండి వారికిది ఆటవిడుపు. అందుకే పిల్లలకు పట్టణానికి ప్రయాణమంటేనే ముఖాలు వేలాడేస్తారు. కోడళ్ళకేమో ఫ్రీ బోర్డింగ్ అండ్ లాడ్జింగ్‌లా హాయిగా విశ్రాంతి తీసుకొంటారు.

తలొంచుకొని తన పని తాను చేసుకుపోయే పార్వతమ్మ ఏమీ మాట్లాడదు. 70 ఏళ్ళు పైబడే సరికి శంకర్‌రావుకి వంట్లో నలతగా ఉండేసరికి ఆయుర్వేద వైద్యుడు ఆచారి ఎందుకైన మంచిది పెద్ద డాక్టర్‌కు చూపించుకోమనేసరికి వచ్చింది తంటా.

అందరూ భోజనాలు చేసేటప్పుడు "వాసూ! మీ నాన్న గారిని పెద్ద ఆసుపత్రిలో చూపించాలి. మేమూ మీతో వద్దామను కుంటున్నాంరా" అని పార్వతమ్మ రెండో కొడుకునడిగింది.

అన్నం కలుపుకుంటున్నవాడల్లా తలెత్తి "అమ్మా! మీరు రావడానికి నాకేమి అభ్యంతరంలేదు. కాని మీ వెంబడి హాస్పిటల్ చుట్టూ తిరిగి ఎవరు చూపిస్తారు? నాకు ఆడిట్ ఉంది. వీలవదనుకుంటా" అన్నాడు.

"అదేమిటిరా! అలాగంటావూ? మేమెప్పుడన్నా ఆ వూరు వచ్చామా ఏమిటీ? మాకేమీ తెలుస్తుంది? ఎవరన్నా వెంబడి రాకపోతే కోడలిని సెలవు పెట్టమనకూడదూ" అంది.

"అత్తయ్య గారూ! పోయిన నెలలో మా అమ్మా, చెల్లీ, పిల్లలూ వస్తే, వాళ్ళతో తిరిగి వూరు చూపించడానికి నా సెలవంతా అయిపోయింది. అయినా చిన్న మరిది దగ్గరలోనే ఉన్నాడు కదా! ఆయనని అడగండి" అంటూ కందిపచ్చడి మరో వాయ కలుపుతూ, చిట్టెత్తి నెయ్యి పోసుకోవడంలో మునిగిపోయింది.

"అ . . . వస్తున్నా!" నంటూ ఎవరో పిలిచినట్లుగా కళ్ళను కమ్మిన నీటిపొరను తుడుచుకునేందుకు బయటికెళ్ళింది పార్వతమ్మ.

వీళ్ళిందరికంటే అఖండుడు మూడవ వాడు. అన్నయ్యలిద్దరూ తప్పుకోగా, తనకెందుకొచ్చిన తంటా? మంచైనా, చెడైనా తనే భరించవలసి వస్తుందేమో తన దగ్గరుంటే. అందుకే ముందే ఆలోచించి పెట్టుకున్నాడు ఏం చెప్పాలో. సాయంత్రం కాఫీ గ్లాసు చేతికిచ్చి పార్వతమ్మ నెమ్మదిగా విషయం కదిపింది.



## ఆఘ్రాణించు

నిజం నిలకడ మీద తెలుస్తుంది
మోసం మనిషిని నిలువెల్లా కాలుస్తుంది
తప్పుడు చెప్పుడు మాటలు
తేనెకన్నా తియ్యగా ఉండి
నిజాన్నీ, మమకారాన్నీ మంచినీ
నేలరాచి
స్వర్గసీమలా ఉన్న సంసారాన్ని
నాశనం చేస్తాయి...

-కొప్పర్తి రామారావు,
శ్రీ కుమార్ భవనం మేడపైన,
పవరుపేట, ఏలూరు.

"మా ఆవిడ పురిటికి పుంటింటికెళ్ళిందని నీకు తెలుసుకదామ్మా! మా ఇల్లు టౌన్‌కు దూరం కూడాఏ అపరాత్రి వేళో బాగా లేకపోతే రిక్షా కూడా దొరకదు. ఇంట్లో ఆడవాళ్ళెవరూ లేకుండా ఎట్లా? మాదేమన్నా పెద్ద టౌనా ఏమిటి? సిటీలో ఉంటున్న వాళ్ళే అట్లా మాట్లాతారే?" అంటూ నిర్మొహమాటంగా కదని తేల్చిచెప్పాడు.


పార్వతమ్మకు మిగిలిన ఒకే ఒక ఆశ చిన్న కొడుకు రవి. వాడికి రేపే నిశ్చితార్థం జరగబోతోంది. ఇంకా వాడికి సంసార బాధ్యతలు లేవు కాబట్టి ఎటూ విజయవాడకు ట్రాన్స్‌ఫర్ అవుతుంది కాబట్టి వారి దగ్గరకు వెళ్ళితే తమని ప్రాణప్రదంగా చూసుకుంటాడని పార్వతమ్మ నమ్మకం. భార్య పడుతోన్న అవస్థనంతా ఈజీ చైర్లో వాలి అర్ధనిమీలిత నేత్రుడై గమనిస్తునే ఉన్నాడు శంకర్.

సాయంత్రం అందరూ కొబ్బరిచెట్టు కింద మంచాలేసుకొని పూలు కడుతూ, పెళ్ళికి ఎవరెవరూ ఏమి కొనుక్కోనాలా? అని చర్చిస్తున్నారు. దీపారాధనకై పత్తిలోని గింజలు తీస్తూ, అరుగు మీద పార్వతమ్మ కూర్చుంది. పిల్లలందరూ కలిసి బొమ్మరిల్లు కట్టి బొమ్మల పెళ్ళి చేసే హడావిడిలో ఉన్నారు.

"అదుగో పెళ్ళికొడుకు రానే వచ్చాడు. ఏమిటయ్యా విశేషాలు" అంది పెద్ద వదిన.

"మా మరిదికి ముందు చూపు ఎక్కువే. అందుకే ఇంటికి కావలసిన సామానంతా ముందే కొనిపెట్టాడు" అంది చిన్న వదిన.

"నాకు తెలీక అడుగుతాను. వాలుగు లక్షల కట్న




కే. శ్రీనివాస్ (కార్టూనిస్ట్), మల్లారం (పోస్ట్), మలహార్ (మండల్), కరీంనగర్ (జిల్లా).

మిస్తామని ఆ గుంటూరు వాళ్ళు వస్తే, వాళ్ళకు కాదని రెండు లక్షలిచ్చే ఈ సంబంధం ఒప్పుకన్నావేమిటి? ఏమన్నా ప్రేమ వ్యవహారమా?" అంది పెద్దామె గడుసుగా.

"డబ్బెవరికైనా చేదా ఏమిటి? నాలుగు లక్షలతో అమ్మా, నాన్న, ఆకాశాన్నంటే పందిరి వేసి, తాటికాయంత లడ్డూ పెట్టి, ఊరందరికీ బంతి పెట్టి, చివరికి వట్టి చేతులు చూపేవారు. నాకు పిల్లే మిగులు తుంది. అందుకే తక్కువ కట్నమిచ్చినా, ఏయిర్ ఇండియాలో పని చేస్తున్న తుషారను చేసుకుంటున్నా. లైఫ్ లాంగ్ ఎన్నో సౌకర్యాలో. ఆమె రిజిష్టర్డ్ ప్రాపర్టీ కాబట్టి నో ప్రాబ్లమ్ ఫర్ మనీ. ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వడ్డీలాగా ప్రతి నెల జీతం' ' అన్నాడు.

"వామ్మో! మరిది ఏమిటో అనుకున్నాను. గడుసు పిండానివే. ముందిలాగా మాట్లాడకుండా ఉండేవారిని అందుకే నమ్మరాదంటారు." అంది పెద్ద వదిన.

" నీ యెం.బి.ఏ.లో నేర్చుకొన్న బిజినెస్ ట్రెండ్స్ అన్నీ జీవితంలో ప్రయోగిస్తున్నావే" అంది చిన్న వదిన.

నిన్న మొన్నటిదాకా తన చెంగు పట్టుకు తిరిగిన వాడు, ప్రతి చిన్న విషయం తనతో చెబుతూ, ఏది కావాలన్నా తనను అడిగే తన చిన్న కొడుకు తమ కోరికను మన్నిస్తాడని ధైర్యంతో తిరుగుతోంది పార్వతమ్మ.

జీవితాన్ని డబ్బుతో బేరీజు వేస్తోన్న కొడుకుని కన్నార్పకుండా చూసింది. నిశ్చితార్థం అయిపోయింది. ఇక అంతా కలుసుకునేది పెళ్ళిలోనే. అందరూ ఎవరిపాటికి వాళ్ళు ప్రయాణపు హడావిడిలో ఉన్నారు. పార్వతమ్మ కాలుగాలిన పిల్లిలా అటుఇటు తిరుగుతూ, ఆఖరివాడితో ఎలా కదపాలా అని ఆలోచిస్తుంది.

"రవీ! నీకు విజయవాడకు ఎప్పుడు టాన్స్‌ఫరవు తోందిరా?" అంది పార్వతమ్మ.

"ఎందుకు?" అన్నాడు రవి.

"నాన్నగారికి ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరి రాత్రయ్యే సరికి ఊపిరి తిరక్కుండా దగ్గుతున్నాడు. రాత్రిపూట నిద్ర పోవటం లేదు. అక్కడ పెద్ద హాస్పిటల్లో చూపించ వచ్చునీ" అంది.

"నేను మద్రాసుకు ట్రాన్స్‌ఫర్‌కు అప్లై చేసా. తుషార కూడా అక్కడే కదా! అందుకని" అన్నాడు.

"మెడ్రాసయితే ఇంకా మంచిది కదరా! ఇంకా పెద్ద ఆసుపత్రులు బోలేడున్నాయి కదరా?" అంది.

"ఏందమ్మా? మేము కొన్నాళ్ళు ఎంజాయ్ చెయ్యానీ! అన్నయ్యలను అడక్క పొయ్యావా?" అన్నాడు.

"అందరిని అడగటం అయ్యింది. వాళ్ళకు తగ్గ కారణాలు వాళ్ళు చెప్పారు" అంది.

"అయితే నేనేనా చెప్పలేంది అమ్మా! కాలం మారి పోయింది. మీ అత్తగారి తరంలో 'కుటుంబం' అంటే అత్తా, మామా, మరుదులూ, ఆడపడుచూ, సేద్యగాళ్ళు, గొడ్లు గోదా అన్నీ కలిసి ఉండేవి. అప్పుడు స్త్రీ ఇంటికే పరిమితం కాబట్టి సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు చాకిరీతో సరిపోయేది.

నీ తరం వచ్చేసరికి ఉద్యోగస్తులు కావడం వల్ల గొడ్లూ, గోదా, సేద్యగాళ్ళు అంతా పోయారు. స్త్రీలు కొంచెం వెలుతురు చూడటం నేర్చుకుని కొంచెం తమ పరిధి పెంచుకున్నారు.

కాని నేటి కంప్యూటర్ యుగంలో స్త్రీ పురుషుడితో పోటీ పడుతోంది. అందుకే ఈ రోజు 'కుటుంబం' అంటే భార్యా, భర్తా, వారి పిలలూ మాత్రమే. మూడోవాడికి చోటు లేదు. వారి ఆలోచన పరిధి అంతా వారి చుట్టూనే ఉంటుంది. వేరే వాళ్ళు ప్రవేశిస్తే కలహాల కాపురమ వుతుంది. దీన్నే జనరేషన్ గ్యాప్ అంటారు" అని చిన్న సైజు ఉపన్యాసం ఇచ్చాడు.

దొడ్లో తూనీగలు పట్టుకుంటూ, గిల్లా కర్రా ఆడుతూ, తన చెంగు వదలని కొడుకేనా వీడు? వారిలా స్వార్థంగా తాము ఆలోచించి ఉంటే వీళ్ళంతా ఇంతపెద్ద చదువులు చదివేవాళ్ళా? తాహతకు తగదని అందరూ చెప్పున్నా వినకుండా పిల్లలు కోరారని సుక్షేత్రమైన మగాణిని హారతి కర్పూరంలా కరగించారు. ఏమి మిగిలింది? ఆయనకు ఈ విషయాలన్ని తెలిస్తే తట్టుకోగలరా? ఆయన బాధ పడుతూంటె చూడలేకుండా ఉంది పార్వతమ్మ. దిక్కుతోచని దానిలా గోడకి చేరబడి కూర్చుంది.

పేపరు చూస్తూ ఈజీ చైర్లో పడుకున్న శంకర రావు దగ్గరికి తీర్పు కోసరమన్నట్టు పిల్లలు పరుగెత్తుకుంటూ వచ్చారు. "తాతయ్యా! నానీ చూడూ! బొమ్మరింటికి దూరంగా ఇంకో చిన్నిల్లు కట్టాడు. పడగొడతానంటె తంతానంటున్నాడు"అంది పప్పీ.

"పప్పికేం తెలీదు తాతయ్యా! రేపు నేను పెద్దయ్యాక అమ్మా, నాన్నా వస్తే వుండటానికి ఔట్ హౌస్ కట్టాను" అన్నాడు నానీ.

"అంత పెద్ద ఇల్లుంటే వేరే అవుట్ హౌస్ ఎందుకు? దండగ"అంది పప్పీ.

"నేనపుడు అమెరికా వెళ్ళి వస్తాకదా! అమెరికాలో ముసలి వాళ్ళను హాస్టల్లో ఉంచుతారట కదా! పోనీలే, పాపం! మమ్మీ డాడీయే కదా అని నేను ఔట్ హౌస్ కట్టించాను"అన్నాడు నానీ ఔదార్యం ప్రకటించినట్టుగా.

"తాతయ్యా, నానమ్మ వస్తానంటే నాన్నా, బాబాయిలూ వద్దంటారేమిటి? తాతయ్యా, నాన్నమ్మా ఎంత మంచివారు. తాతయ్య బోలెడు కథలు చెప్తాడు. నాన్నమ్మ బోలెడు తాయిలాలు చేసిపెట్టి బ్రతిమిలాడి తినిపిస్తుంది' ' చక్రాల్లా కళ్ళు తిప్పుతూ అంది పప్పీ.

"నేనసలు ఔట్ హౌస్ కూడా కట్టను, మమ్మీ డాడీని రానివ్వను"అన్నాడు సీరియస్‌గా ముఖంపెట్టి చిన్న మనవడు రాజా.


"ఎందుకూ?"అరిందిలా నడుము మీద చేతులు పెట్టి పప్పీ ప్రశ్నించింది.

"మా నాన్న తాతయ్యకూ. నాన్నమ్మకూ చేసిన మర్యాదే రేపు నేను వాళ్ళకు చెయ్యాలి కదా?"అన్నాడు రాజా.

"ఈ నాన్నలంతా ఇంతేరా!"అంది అందరిలోకీ చిన్నది నాలుగేళ్ళ శాంతి ఎంతో తెలిసినట్లుగా.

ప్రేక్షకుడిలా చూస్తున్న శంకర రావు "ఔరా! కలికాలం"అనుకున్నారు.

శ్రీమతి శాంతా కుమారి,(B.Sc, B.Ed)
టీచర్, జి.జి.హెచ్. స్కూల్,
ఒంగోలు -2.




నానక్ సింగ్, ఇంటి నెం. 9-4-66, బురుడ్ గల్లీ, నిజామాబాద్.